సాక్షి
ప్రకాశం
ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



ఆఫర్ల ధమాకా
దసరా పండుగ వేళ కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. వినియోగదారుల కోసం పలు ఆఫర్లతో వివిధ షోరూంలు ఆకట్టుకుంటున్నాయి. - IIలో..



అక్రమ లేఅవుట్లలో రాళ్ల తొలగింపు
టంగుటూరు మండలంలో అక్రమంగా లేఅవుట్లు వేస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. - IIలో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.4/26
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

27న ఒంగోలులో జాబ్ మేళా

ఒంగోలు టౌన్: ఈనెల 27వ తేదీ ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, ఫ్లక్స్ టెక్ సొల్యూషన్స్ కంపెనీల్లో రిలేషన్ షిప్ ఆఫీసర్, యూఎస్‌ఐటీ రిక్రూట్‌మెంట్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ నుంచి డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన నిరుద్యోగ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావల్సిందిగా కోరారు. ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత సదుపాయాలతో పాటుగా నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం ఇస్తారని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9505229845కు సంప్రదించాలని తెలిపారు.

కాళరాత్రి అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి



త్రిపురాంతకంలో కాళరాత్రి అలంకారంలో గజవాహనంపై బాలాత్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా త్రిపురాంతకంలో శనివారం కాళరాత్రి అలంకారంలో గజవాహనంపై బాలాత్రిపురసుందరీదేవి దర్శనమిచ్చారు. వాహనసేవను వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా మహాదుర్గ అలంకారంలో నంది వాహనసేవ నిర్వహించనున్నారు.

సోమవారం స్పందన రద్దు

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్లు స్పందన విభాగం సూపరింటెండెంట్ డీ నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సందర్భంగా సోమవారం సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించినందున స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

జగనన్న సివిల్ సర్వీస్ ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు టౌన్: జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కోసం ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.లక్ష్మా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రిలిమినరీలో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.50 వేల నగదు ప్రోత్సాహాన్ని అందిస్తారన్నారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నవంబరు 4వ తేదీలోపు దరఖాస్తు నమోదు చేసుకోవాలని, ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరుల సేవలు మరువలేనివి

- పోలీసు అమరుల త్యాగాలకు గుర్తుగా సంస్మరణ దినోత్సవం
- త్యాగాలు చేసిన పోలీసు కుటుంబాలు ధైర్యాన్ని నింపుకోవాలి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- అమర వీరులకు ఘనంగా నివాళులు
- అమరుల స్థూపం వద్ద నూతనంగా పవన్ కుమార్ స్మారకం ఆవిష్కరణ



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి సేవలను గుర్తు చేసుకుంటూ పోలీసులు ముందుకు సాగాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర వీరులకు ఘనంగా నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ దేశ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో సంస్మరణ దినోత్సవం జరుపుకోవటం, వారిని స్మరించుకోవటం ఎంతో భాగ్యంగా భావిస్తున్నానని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలను కొనియాడారు. ఆపద సమయంలో ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు అండగా నిలిచే పోలీసులే ప్రజలకు నిజమైన స్నేహితులని కీర్తించారు. కోవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో పోలీసులు ముందు వరుసలో నిలబడి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కరోనా నియంత్రణకు తోడ్పడ్డారన్నారు. ఈ క్రమంలో కరోనా సోకి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 11 మంది ప్రాణాలు కూడా కోల్పోయారని, ఆ విషయాన్ని గుర్తు చేస్తూ వారికి కూడా నివాళులర్పించారు. పోలీసుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మల భద్రతకు గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి 16 వేల మంది మహిళా పోలీసులను నియమించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు

ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఉన్నా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న పోలీసులకు వందనం అన్నారు. తన సోదరుడు మాగుంట సుబ్బరామన్నను నక్సలైట్లు కిడ్నాప్ చేయటానికి వచ్చినప్పుడు ప్రాణాలకు తెగించి పోరాడిన అమరవీరుడు సీవీ.రత్నం అని కీర్తించాడు. ప్రతి సంవత్సరం సుబ్బరామన్నతో పాటు సీవీ.రత్నంను కూడా తలుసుకొని ఆయన కుటుంబ సభ్యులతో అన్యోన్యంగా ఉంటున్నామని గుర్తు చేశారు. పోలీసుల సంక్షేమం కోసం, వారి ఆరోగ్య అవసరాల కోసం తనవంతుగా రూ.10 లక్షలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల సేవలు ఎంతో శ్లాఘనీయమన్నారు. శాంతి భద్రతల రక్షణకు, నేర నియంత్రణకు, అసాంఘిక శక్తుల ఆటకట్టించటానికి వారు చేస్తున్న సేవలు మరచిపోలేనివన్నారు. ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అసువులు బాసిన ఏడుగురు అమర వీరుల త్యాగాలను పేరు పేరున కీర్తించారు. వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాటి ఉపయోగాల గురించి ఓపెన్ హౌస్ నిర్వహిస్తామన్నారు. మెడికల్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు కూడా నిర్వహించి పోలీసులు చేస్తున్న సేవల గురించి విద్యార్థులకు అవగాహన కలిప్తామన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉంటున్నారంటే అది పోలీసులు సేవలేనన్నారు. అనంతరం ఈ ఏడాది మే నెలలో తుళ్లూరులో బందోబస్తు విధులు నిర్వహిస్తూ పాముకాటుకు ప్రాణాలు కోల్పోయిన ఈ. పవన్ కుమార్‌కు స్మారక ఫలకాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, మేయర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్‌వీ.శ్రీధర రావు ఈ ఏడాది దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన 188 మంది పోలీసుల పేర్లు చదివి అందరికీ వినిపించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి అమరవీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎస్‌వీ.శ్రీధర్ రావుతో పాటు ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, వి.శ్రీనివాసులు, సీహెచ్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ వి.భక్తవత్సల రెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ సుజాత, పోలీస్ అధికారులు, సిబ్బంది

ఒంగోలు డెయిరీ పునఃప్రారంభానికి చర్యలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: ఒంగోలు డెయిరీని పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా అమూల్ సంస్థకు పాలు పోసే రైతుల సంఖ్యను పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమూల్‌కు పాలు పోయడం వలన కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని చెప్పారు. సీసీలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేలా పని ప్రదేశంలోనే నివాసం ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్న సీసీల వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశించారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల్లో ఆశించిన పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించలేకపోతే ఉద్యోగంపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ బడుగు వికాసం పథకంలో త్వరగా యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సూచించారు. ఈ పథకం విషయంలో బ్యాంకర్లతో పాటుగా జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. స్త్రీ నిధి రుణాలను 15 రోజుల్లోగా రికవరీ చేయాలని, దీనికోసం వచ్చే మూడు వారాలపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. తిరిగి చెల్లించని సభ్యులను ఆయా సంఘాల నుంచి తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరి నిర్లక్ష్యం వలన గ్రూపులోని ఇతర సభ్యులు నష్టపోవడం సరికాదని, సమర్థవంతంగా వ్యవహరించలేని ఏపీఎంలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవనందున గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాల్సిన బాధ్యత వెలుగు సిబ్బందిపై ఉందన్నారు. నిర్దేశించిన పథకాల లక్ష్యంలో కనీసం 70 శాతం ఫలితాలు సాధించలేని ప్రాంతాలకు చెందిన వీవోఏ, సీసీ, ఏపీఎం, ఏసీలపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పీడీ తేళ్ల రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ డాక్యుమెంట్ భూ అక్రమాలపై విచారణ వేగవంతం

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఫేక్ డాక్యుమెంట్లతో జరిగిన భూ అక్రమాలపై చేపట్టిన విచారణ మరింత వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు సిట్ అధికారులకు సూచించారు. శనివారం నకిలీ డాక్యుమెంట్ భూ అక్రమాలపై జరుగుతున్న దర్యాప్తుపై సిట్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దసరా పండుగ నేపథ్యంలో ఆది, సోమ, మంగళవారాలు సెలవులు వచ్చినా దర్యాప్తు ప్రక్రియ ఆగకూడదన్నారు. పోలీసు అధికారులకు సహకరించేలా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల్లో హిందూయేతర సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి దర్యాప్తు కొనసాగించాలన్నారు. గురువారం నాటికి దర్యాప్తులో మరింత పురోగతి సాధించాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారులకు ఏ విధమైన సహకారం అవసరమైనా తెలపాలన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిలో ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, కనిగిరి డీఎస్పీ రామరాజు, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఓఎంసీ అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, ఒంగోలు తహశీల్దార్ మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్.. టూ వీలర్ ఢీ

- ఒకరు మృతి

మార్కాపురం రూరల్: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దరిమడుగు సమీపంలో ఉన్న ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దరిమడుగు పాఠశాలలో నాడు నేడు పనులను ప్రభుత్వ ఉపాధ్యాయులు సాధు కోటేశ్వరరావు అతని భార్య పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కోటేశ్వరరావు తన ద్విచక్ర వాహనంతో రోడ్డుపైకి వచ్చాడు. అక్కడ వల్లెం హరిబాబు లిఫ్ట్ అడుగగా తన బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా ఎ1 గ్లోబల్ కళాశాల సమీపంలో ఆర్టీసీ బస్సు.. ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. గాయాలు కావడంతో ఇరువురిని 108లో జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ హరిబాబు (21) మృతి చెందగా, కోటేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. హరిబాబు స్వగ్రామం దొనకొండ మండలం రుద్రసముద్రం గ్రామంగా పోలీసులు తెలిపారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దూకుడు పెంచిన సిట్

- సిట్ బృందం నూతనంగా ఐదు కేసులు నమోదు
- ఆ కేసుల్లో 8 మందిని అరెస్ట్ చేసిన వైనం
- ఇప్పటి వరకు మొత్తం 20 మంది అరెస్ట్

ఒంగోలు సబర్బన్: నకిలీ డాక్యుమెంట్లు, రబ్బరు స్టాంపుల కేసులో సిట్ పోలీసుల బృందం దూకుడు పెంచింది. ఈ మేరకు ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్ట్ చేసిన సిట్ బృందం రెండు రోజుల్లో మరో ఐదు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్ శనివారం కేసుల వివరాలు, ఆయా కేసుల్లో అరెస్టయిన వారి వివరాలను విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే... ఎస్పీ మలికాగర్గ్ నేతృత్వంలో జిల్లాలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, సింగరాయకొండ సీఐ డీవో రంగనాథ్, పామూరు సీఐ కే.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సిట్ బృందాలు నూతనంగా మొత్తం ఐదు కేసులు నమోదు చేశాయి. అందులో ఒంగోలు నగరానికి చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని ఎంఎస్‌ఆర్ కేన్సర్ హాస్పిటల్ వెనుక వైపు నివాసం ఉంటున్న విప్పాల శ్రీనివాస్, సయ్యద్ అల్లాభక్షు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు కేసులు నమోదు చేశారు. ఎస్ఎంఆర్ హాస్పిటల్ వెనుక వారి స్థలాల్లో నిర్మించుకున్న ప్రహరీ, పిల్లర్లను నగరానికి చెందిన కొందరు పడగొట్టి, ఆ స్థలాలకు సంబంధించి నకిలీ డీకే పట్టాలు సృష్టించటంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తామని, ఇబ్బందులు పెడతామని బెదిరించటంతో బాధితులు భయపడి ఊరకుండిపోయారు. అయితే సిట్ బృందం ఏర్పాటైన తరువాత ధైర్యం తెచ్చుకున్న బాధితులు విప్పాల శ్రీనివాస్, సయ్యద్ అల్లభక్షు వారి వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు చూపించారు. దీంతో వాస్తవాలను పరిశీలించిన సిట్ అధికారులు వారి ఫిర్యాదు మేరకు నాలుగు కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఒంగోలు కేశవరాజు కుంటకు చెందిన రాయపాటి ఏలియా, రాయపాటి అచ్యుత్ కుమార్, పాత గుంటూరు రోడ్డుకు చెందిన గరికపూడి సుధాకర్, షేక్ మీరావలి, కారాని దుర్గ ఉన్నారు. ఈ కేసుల్లో నిందితులకు సహకరించిన మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. వారికోసం సిట్ బృందం అన్వేషణ చేపట్టింది. అదేవిధంగా ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామ శివారు ఎన్‌హెచ్-16 రోడ్డుకు ఆనుకొని సర్వే నంబర్-163, 164లో ఉన్న భూమికి డిమాండ్ పెరిగింది. స్థానిక ఎంఆర్‌ఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ప్రకారం కొందరు ఆ భూముల వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకున్నారు. దీంతో ఫోర్జరీ వీలునామాలు, అగ్రిమెంట్లు సృష్టించారు. చివరకు భూమి యజమాని ఒంగోలు రాజీవ్ నగర్‌కు చెందిన ఎర్రా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిట్ బృందం అధికారులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన మద్దిపాడు మండలం పెదకొత్తపల్లి గ్రామానికి చెంది స్థానిక ఒంగోలు నగరంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న ఉబ్బా వెంకాయమ్మ, ఒంగోలు జయప్రకాశ్ కాలనీకి చెంది ప్రస్తుతం వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న ఉబ్బా వెంకటేశ్వర్లు, నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన జేసీబీ యజమాని బరకం అచ్చయ్యను సిట్ పోలీస్ బృందం అరెస్ట్ చేసింది. ఇంకా ఈ కేసుల్లో మరికొంతమంది అనుమానితులను కూడా అరెస్టు చేసేందుకు సిట్ అధికారులు రంగం సిద్ధం చేశారు.


విజయ్ డిజిటల్ షోరూంలో గృహోపకరణాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో బట్టలు కొనుగోలు చేస్తున్న మహిళలు


బిగ్‌సీ మొబైల్ షోరూంలో సెల్‌ఫోన్లు..


సోనోవిజన్ షోరూంలో గృహోపకరణాలు చూస్తున్న వినియోగదారులు

ఆఫర్ల ధమాకా!

- పండుగ వేళ వ్యాపారం కళకళ
- దుకాణాల్లో సందడే సందడి
- వస్త్ర వ్యాపారానికి గిరాకీ
- బంగారు దుకాణాల్లోనూ పెరిగిన కొనుగోళ్లు
- ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ షోరూంలలో ఆఫర్లు


లలితా జ్యూవెలరీస్ షోరూంలో బంగారు ఆభరణాల కోసం

ఒంగోలు: ఓ పక్క దసరా శరన్నవరాత్రులతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుంటే.. మరో వైపు వివిధ రకాల వ్యాపారాలతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో పలు రకాల వస్తువులు కొనుగోలు చేయడానికి జనం పోటీ పడుతున్నారు. నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలు, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసేవారితో వ్యాపారుల పంట పండుతోంది.

ఫ్యాషన్ ప్రపంచం

శ్రావణమాసం నుంచే వస్త్ర దుకాణాల్లో ప్రత్యేక ఆఫర్లు ఊరిస్తున్నాయి. గతంలో మాదిరిగా విజయవాడ, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లే పనిలేకుండా.. నూతనంగా వెలిసిన మల్టీ నేషనల్ కంపెనీలు కొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఫ్యాషన్ ప్రపంచంలో యువతను ఆకట్టుకునేందుకు అనేక ఫారిన్ బ్రాండెడ్ కంపెనీల రెడీమేడ్ డ్రెస్సులు అందుబాటులో ఉండడంతోపాటు బంపర్ ఆఫర్లను కూడా ప్రకటిస్తున్నాయి.

నూతన వాహనాలు షురూ..

దసరా వేడుకల్లో భాగంగా ఆయుధపూజ చేయడం సహజమే. ఈ నేపథ్యంలో నూతన వాహనం కొనుగోలు చేసి పూజ చేయించుకుంటే అమ్మవారి కరుణా కటాక్షం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. దీనిపై యువత ఆసక్తి కనరుబస్తుండటంతో షోరూంల నిర్వాహకులు డౌన్ పేమెంట్‌ను తగ్గించి క్యాష్ చేసుకొనే పనిలో పడ్డాయి. ఎలక్ట్రానిక్ వస్తువులకూ డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా ఇప్పుడైతే ఏసీలు తక్కువ ధరకే లభిస్తాయని అంతా కొనుగోలు చేస్తున్నారు. దసరాకు మాత్రమే కాదు దీపావళికి సైతం ధమాకా అంటూ అనేక రకాలుగా వ్యాపారవర్గాలు ఉత్సాహాన్ని నింపుతున్నాయి. మొబైళ్ల కొనుగోలు, పెద్ద ఆండ్రాయిట్ టీవీలు కొనేవారితో దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి.

పండగ కళ కనిపిస్తోంది



దసరా పండగతో వినియోగదారుల రాక పెరిగింది. కొనుగోళ్ల పట్ల కూడా ఆసక్తి చూపుతున్నారు. ఫైనాన్స్ సౌకర్యం అందుబాటులో ఉండటం, తమ సంస్థపై వినియోగదారులకు విశ్వాసం మెండుగా ఉండటంతో వ్యాపారం ఊపందుకుంది. రూ. 2వేలు విలువ చేసే వస్తువులను కొన్నవారికి ఒక స్క్రాచ్ కార్డు అందుబాటులో ఉంచాం. ప్రతిరోజూ విన్ ఎల్‌జీ డ్రీమ్ అనే స్కీం, గ్రాండ్ ప్రైజ్‌గా ఆడి.. కారును లక్కీడ్రాగా ప్రకటించాం.

సుబ్బారావు, సోనోవిజన్ మేనేజర్, ఒంగోలు

ఆధునిక సాంకేతికత వైపు



ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్న కొద్దీ దానిని వినియోగించుకోవడంలో యువత పోటీపడుతున్నారు. అధునాతన మోడళ్ల పట్ల ఆదరణ పెరిగింది. ఖరీదు కన్నా నాణ్యతపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. రూ. 10వేల వరకు క్యాష్ బ్యాక్. ప్రతి కొనుగోలుదారునికి ఒక గిఫ్ట్ అందిస్తున్నాం.

రియాజ్, బిగ్‌సీ మొబైల్స్ ఒంగోలు బ్రాంచి మేనేజర్

అక్రమ లేఅవుట్లలో రాళ్ల తొలగింపు


టంగుటూరు చెల్లెమ్మతోటలో అక్రమ లేవుట్ల రాళ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

టంగుటూరు: అక్రమంగా లే అవుట్లు వేస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. వల్లూరు గ్రామ పరిధిలో శివపురం రోడ్డులో జమ్ములపాలెం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ నాయకుడు మక్కెన వెంకట్రావు, ఒంగోలుకు చెందిన రామకృష్ణ అనుమతి లేకుండా సర్వే నంబరు 540- 2ఏ/1సీలో 1.27 సెంట్లు, 540-2ఏలో 63 సెంట్లు మొత్తం 1.90 సెంట్ల మేర వ్యవసాయ భూమిలో ప్లాట్లుగా మార్చి రూ. 6 కోట్లకు విక్రయించేలా రాళ్ళు వేశారు. వ్రప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి కోటి రూపాయలు పలుకుతుంది. దీంతో వల్లూరు పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్ పంచాయతీ సిబ్బందితో అక్రమ లేవుటు రాళ్లను తొలగించి, నోటీసులు అందించారు.

టంగుటూరులో ..

టంగుటూరులోని చెల్లెమ్మతోటలో సర్వే నంబర్లో 1243లో 70 సెంట్లలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయి. టీడీపీ నాయకుడు మక్కెన కోటేశ్వరరావు దగ్గర ఎలాంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాకుండానే పరిమి శ్రీను అనే వ్యక్తి.. ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్లు, ప్లాట్ల రాళ్లు ఏర్పాటు చేసి విక్రయాలకు సిద్ధం చేశారు. టంగుటూరు 4వ సచివాలయ కార్యదర్శి గోవిందు లేఅవుట్ల రాళ్లను తొలగించి, నోటీసులు జారీ చేశారు.

చర్యలు తీసుకుంటాం: నర్రా జగదీష్ బాబు: ఈఓఆర్డీ

వ్యవసాయ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు వేశారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

అనుమతులు ఇలా..

టంగుటూరు మండలంలో టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు. రాత్రికి రాత్రే అక్రమ లే అవుట్లు వేస్తున్నారు. వ్యవసాయ భూమిలో వెంచర్ ఏర్పాటు చేయాలంటే కమర్షియల్ పరిధిలో ఉన్న నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేయాలి. భవనాల నిర్మాణానికి భూమి ఎంతవరకు దృఢంగా ఉందో అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకొని రెవెన్యూ సబ్ రిజిస్ట్రార్ అధికారుల ఆదేశాల మేరకు భూమి మార్కెట్ విలువలో 5 శాతం నగదును ప్రభుత్వానికి చెల్లించాలి. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజలకు అవసరమయ్యే ప్రధాన వసతులైన విద్యుత్, మంచి నీరు, రోడ్లు, డ్రైనేజీలు, మొదలగు సౌకర్యాలతో వెంచర్లో ఎలా సమకూరుస్తారో లిఖిత పూర్వకంగా వినతి పత్రం అందించాలి. ఆ తర్వాత అధికారుల నుంచి అనుమతులు ఇస్తేనే పనులు ప్రారంభించాలి.

కరణం వెంకటేష్‌ను పరామర్శించిన అశోక్


వెంకటేష్‌ను పరామర్శిస్తున్న అశోక్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపవడి ఒంగోలు సంఘమిత్ర వైద్యశాలలో చికిత్స పొందుతున్న చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను ఆరోగ్య శ్రీ రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చీరాల రూరల్ బోయినవారిపాలెం సమీపంలో ఆటో ఢీకొనడంతో కరణం గాయపడ్డారు.

'ఐదు' ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్షప్రసారం




కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

నేటి నుంచి పారా ఆసియా క్రీడలు

- వారం పాటు ఈవెంట్
- 313 మందితో భారత బృందం



హాంగ్జౌ: ఇటీవల ఇక్కడే జరిగే ఆసియా క్రీడల్లో ముందెన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత బృందంలాగే పారా అథ్లెట్లు కూడా గంపెడాశలతో పారా ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ పోటీల్లో భారత దివ్యాంగ అథ్లెట్లు సత్తాచాటాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన అవని లేఖరా, సుమిత్ అంటిల్‌లు భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. టోక్యోలో 2021లో జరిగిన మెగా ఈవెంట్‌లో స్టార్ షూటర్ అవని బంగారంతో పాటు కాంస్యం గెలిచింది. జావెలిన్ త్రోయర్ అంటిల్ కూడా పసిడి పట్టాడు. వీరితో పాటు పతకం ఆశలున్న పారా షూటర్ మనీశ్ నర్వాల్, షట్లర్లు ప్రమోద్ భగత్, కృష్ణ నగర్‌లు సహా మొత్తం 313 మందితో కూడా భారత పారా అథ్లెట్ల బృందం హాంగ్జౌలో పతకాల వేట మొదలుపెట్టేందుకు సై అంటోంది. మొత్తం 22 క్రీడాంశాలు నిర్వహిస్తుండగా భారత అథ్లెట్లు 17 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సరిగ్గా వారం రోజుల పాటు జరిగే ఈ పారా మెగా ఈవెంట్‌లో 43 దేశాలకు చెందిన సుమారు 4000 మంది అథెట్లు పోటీపడనున్నారు. 22 క్రీడాంశాల్లో 566 గోల్డ్ మెడల్ ఈవెంట్లున్నాయి. తొలిసారిగా 2010లో గ్వాంగ్‌జౌలో పారా ఆసియా క్రీడలు జరిగాయి. ఇందులో భారత బృందం 14 పతకాలు సాధించి 15వ స్థానంలో నిలిచింది. 2018లో జరిగిన గత పారా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు మొత్తం 72 పతకాలు సాధించి టాప్-10లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఈ సారి పతకాల సెంచరీ మార్కు దాటించేందుకు భారత అథ్లెట్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షూటింగ్‌లో క్రితం సారి మూడు పతకాలే వచ్చాయి. అయితే అవని జకార్తా (2018) ఈవెంట్‌లో ఆడలేదు. ఇప్పుడు స్టార్ షూటర్ అందుబాటులో ఉండటంతో షూటింగ్‌లోనూ పతకాల సంఖ్య ఆశించినంత పెరగొచ్చు.

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ధమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కురదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులోక్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.


క్లాసెన్


బట్లర్


జాన్సెన్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్ పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగుకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్క్‌రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్-లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. వికెట్ల పతనం: 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. వికెట్ల పతనం: 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. బౌలింగ్: టాప్లీ 8.5-0-88-3, విల్లీ 9-1-61-0, రూట్ 6.1-0-48-0, అట్కిన్సన్ 9-0-60-2, వుడ్ 7-0-76-0, ఆదిల్ రషీద్ 10-0-61-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం: 1-18, 2-23, 3-24, 4-38, 5-67, 6-68, 7-84, 8-100, 9-170. బౌలింగ్: ఇన్‌గిడి 5-1-26-2, జాన్సెన్ 5-0-35-2, రబడ 6-1-38-1, కోయెట్జీ 4-0-35-3, కేశవ్ 2-0-27-1.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.



స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం: 1-7, 2-28, 3-54, 4-68, 5-71, 6-91, 7-221, 8-244, 9-252, 10-262. బౌలింగ్: మదుషంక 9.4-1-49-4, రజిత 9-0-50-4, కరుణరత్నే 9-1-58-0, తీక్షణ 10-0-44-1, హేమంత 8-0-42-0, ధనంజయ 4-0-13-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. వికెట్ల పతనం: 1-18, 2-52, 3-104, 4-181, 5-257. బౌలింగ్: ఆర్యన్ దత్ 10-0-44-3, వాన్ బీక్ 10-0-57-0, మీకెరెన్ 8-1-39-1, డి లీడ్ 3-0-29-0, వాన్‌డర్ మెర్వ్ 9-0-42-0, అకెర్‌మన్ 8.2-0-39-1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం



ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5-11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21-18, 19-21, 21-7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11-10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18-18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11-3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20-16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20-19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3-0, ఆపై 3-2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14-2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.

మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...' ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా' అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ 'ఎల్లో కార్డు'లు కూడా చూపించాల్సి వచ్చింది.


● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ


● కాజోల్

సరదా.. దసరా..


● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సినిమా

సరిపోదా శనివారం?


● నాని

'అంటే సుందరానికీ' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి 'సరిపోదా శనివారం' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు

- దర్శకురాలు పూజ



సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ– ''సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో 'మార్టిన్ లూథర్ కింగ్' నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక 'మార్టిన్ లూథర్ కింగ్' విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం 'మండేలా' కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఒకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్యలున్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది'' అని చెప్పుకొచ్చారు.

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా!

- హీరో కార్తికేయ


● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

''ఆర్‌ఎక్స్ 100' తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో 'మంగళవారం' సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో 'ఆర్‌ఎక్స్ 100' తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా 'మంగళవారం'లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను'' అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమీర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''మంగళవారం' మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల 'మంగళవారం'తో నెరవేరింది'' అన్నారు స్వాతి రెడ్డి. ''ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది'' అన్నారు సురేష్ వర్మ. ''నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో 'మంగళవారం'కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు'' అన్నారు పాయల్.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● పూజిత, విరాజ్

'బేబి' సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జోరుగా హుషారుగా'. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది'' అన్నారు.